క్లుప్తంగా

కరాటేలో ముగ్గురికి పతకాలు



పెనమలూరు: కరాటే పోటీల్లో ముగ్గురు క్రీడాకారులు పతకాలు సాధించారని కోచ్ ఎస్. దుర్గారావు తెలిపారు. ఆయన ఆదివారం వివరాలు తెలుపుతూ ఖమ్మంలో ఈ నెల 5వ తేదీన జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలు జరిగాయన్నారు. కానూరు సెయింట్ థెరిసా పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి ఆర్.ప్రభుకిరణ్‌రెడ్డి 11 సంవత్సరాల విభాగం ఎల్లో బెల్టులో వెండి పతకం, కానూరుకు చెందిన ప్రభురేచింతల 37 సంవత్సరాల విభాగం బ్రౌన్‌బెల్టులో బంగారు పతకం, పెరికల భానుప్రకాష్ 37 సంవత్సరాల విభాగంలో బంగారు పతకం గెలిచారన్నారు. క్రీడాకారులకు సినీనటుడు సుమన్ బహుమతులు అందజేశారని పేర్కొన్నారు.

నేడు స్పందన

విజయవాడ రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30గంటలకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా అందజేయాలని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.భార్గవి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఉపాధి పనుల గుర్తింపు కోసం గ్రామసభలు నేడు

ఉంగుటూరు: ఉపాధి హామీ పథకం ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు కోసం మండలంలోని ఎలుకపాడు, నాగవరప్పాడు, వెల్దిపాడు, వెన్నూతల గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. ఈ సభలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు, పాలకేంద్రం అధ్యక్షులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

భక్తిప్రపత్తులతో చండీహోమం



కంకిపాడు: పట్టణంలోని ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో ఆదివారం చండీహోమం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ప్రార్థనా మందిరంలో శ్రీ లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం పురస్కరించుకుని చండీహోమం చేశారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది. ఈ సందర్భంగా ప్రార్థనా మందిరంలోని శ్రీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఆర్యవైశ్య ప్రార్థనా మందిరం కమిటీ ప్రతినిధులు కె.సీతారాంబాబు, యెందూరి వాసు, వంకదారు నాగాంజనేయులు పర్యవేక్షించారు.

14 నుంచి కార్తిక మాస పూజలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈ నెల 14 నుంచి కార్తీక మాస పూజలు ప్రారంభమవుతాయని ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ తెలిపారు. ఈ నెల 14న కార్తిక మాసం ప్రారంభమై డిసెంబర్ 13 వరకు ఉంటుందన్నారు. కార్తిక మాసంలో భాగంగా 17న నాగులచవితి, 23న ఏకాదశి, 26న కార్తిక పౌర్ణమితోపాటు నాలుగు కార్తిక సోమవారాలను ఆలయంలో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాల పంపిణీ హర్షణీయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని హనుమాన్‌జంక్షన్ జర్నలిస్ట్స్ వేల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు తాడి రంగారావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించడం చారిత్రాత్మకమని కొనియాడారు. ప్రతి జర్నలిస్టుకు మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని కేబినెట్‌లో తీర్మానించడం వేలాదిమంది జర్నలిస్టుల కుటుంబాల్లో ఆనందాన్ని నింపిందని చెప్పారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించటంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పాతపాడులో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. బీపీ, షుగర్, ఈసీజీ వంటి వైద్యపరీక్షలను ఉచితంగా చేసి, మందులను కూడా ఉచితంగా అందజేస్తారని వివరించారు. స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొనే ఈ వైద్యశిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

కంకిపాడు: ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ప్రసాద్ సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఆదివారం అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈడుపుగల్లు, కంకిపాడు, కుందేరు, పునాదిపాడు గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ ప్రసాద్ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో వచ్చిన అర్జీలను పరిశీలించారు. ప్రసాద్ మాట్లాడుతూ అర్హులకు ఓటు హక్కు కల్పించడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని వివరించారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌లో ఫారం-6.. 49, ఫారం-7.. 25, ఫారం-8.. 25 అందాయన్నారు. ఆదివారం క్యాంపెయిన్‌లో ఫారం-6.. 101, ఫారం-7.. 24, ఫారం-8.. 57 అందాయన్నారు. చేర్పులు, మార్పులు, తొలగింపుల అర్జీలను పూర్తి స్థాయిలో పరిశీలించి తుదిజాబితాను రూపొందించడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. పర్యటనలో ఆర్ఐ వెంకటరమణ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

యువత ఓటు నమోదు చేసుకోవాలి

పెనమలూరు: యువత తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆర్డీఓ డి.రాజు తెలిపారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం పెనమలూరులో 1268, 129,138 నుంచి 144 పోలింగ్ కేంద్రాలు, పోరంకిలో 105 నుంచి 117 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం పెనమలూరు నియోజకవర్గంలోని 304 పోలింగ్ కేంద్రాల్లో చేపట్టామన్నారు. డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటర్ల దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. యువ ఓటర్లు నమోదు సంఖ్య ఎక్కువగా ఉండాలన్నారు. బూత్‌లెవల్ అధికారులు యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పొరపాటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్ల జాబితాలో, చిరునామా, ఇతర మార్పులు ఉన్నా దరఖాస్తు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, బీఎల్వోలు పాల్గొన్నారు.



పెనమలూరులో పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజు

ఓటర్ల జాబితా ప్రత్యేక క్యాంపులో 222 అర్జీలు

ఉంగుటూరు: మండలంలో రెండు రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక క్యాంపునకు మొత్తం 222 అర్జీలు వచ్చినట్లు డెప్యూటీ తహసీల్దార్ శ్రీలత తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక క్యాంపులను డెప్యూటీ తహసీల్దార్ శ్రీలత ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో నూతనంగా ఓటు నమోదు కోరుతూ 197 అర్జీలు, మార్పులు చేర్పుల కోసం 20అర్జీలు, మృతిచెందినవారి ఓటర్ల తొలగింపు కోరుతూ ఐదు అర్జీలు కలిపి మొత్తం 222 అర్జీలు అందినట్లు వివరించారు.

ముగిసిన ఓటర్ల ప్రత్యేక ప్రచార కార్యక్రమం

గన్నవరం: నియోజకవర్గంలో రెండురోజులుగా జరుగుతున్న ఓటర్ల నమోదు ప్రత్యేక ప్రచార కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. నియోజకవర్గంలోని నాలుగు మండలల్లోగల 306 పోలింగ్ కేంద్రాల్లో కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, తొలగింపులు, పోలింగ్ కేంద్రాల మార్పు కోసం దరఖాస్తులను బీఎల్వోలు స్వీకరించారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు గోపాల్‌రెడ్డి పరిశీలించారు. రెండు రోజుల్లో నియోజకవర్గవ్యాప్తంగా కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, తొలగింపులు, పోలింగ్ కేంద్రాల మార్పు కోసం మొత్తం 1,027 దరఖాస్తులు వచ్చినట్లు గోపాల్‌రెడ్డి తెలిపారు.



గన్నవరంలో ఏర్పాటు చేసిన ఓటర్ల నమోదు శిబిరం

సంప్రదాయ నృత్యం.. నేత్రపర్వం

విజయవాడ కల్చరల్: క్యాపిటల్ అమరావతి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సంప్రదాయ నృత్యాలు నేత్ర పర్వంగా సాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సాంస్కృతిక బృందాలు కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం సంప్రదాయంలో గ్రూప్, సోలో విభాగంలో సంప్రదాయ కీర్తనలకు నృత్యాలను ప్రదర్శించారు. 40 పైగా బృందాలు కార్యక్రమంలో పాల్గొన్నాయి. ప్రదర్శన చేసిన వారికి నిర్వాహకులు జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. సంస్థ అధ్యక్షుడు పైలా శివవెంకట శివప్రసాదరావు మాట్లాడుతూ యువతలో సంప్రదాయ నృత్యాల పట్ల అవగాహన కల్పించడానికి కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంస్థ ఉపాధ్యక్షుడు పైలా ఆనంద్, కార్యదర్శి డీఏ దేవి పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యం చేస్తున్న బాలిక

‘ఇగ్నో’లో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచంలోనే అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను పాటించే విద్యాసంస్థల్లో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) మొదటిదని ఆ సంస్థ విజయవాడ ప్రాంతీయ కేంద్రం సహాయ సంచాలకుడు డాక్టర్ బి. ప్రసాద్‌బాబు అన్నారు. కేబీఎన్ కళాశాల ఇగ్నో స్టడీ సెంటర్ నూతన విద్యార్థుల ఇండక్షన్ మీటింగ్ ఆదివారం ఆ కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో ఇగ్నోకు ప్రత్యేక స్థానముందన్నారు. ప్రధానంగా విద్యార్థులకు వారివారి కోర్సులకు సంబంధించి సంపూర్ణ జ్ఞానం అందించే దిశగా కోర్సు రూపకల్పన ఉంటుందన్నారు. సుమారు మూడు దశాబ్దాలుగా ఇగ్నో ఉన్నత విద్యారంగ వ్యాప్తికి ఇతోధిక సేవలందిస్తుందన్నారు. ఇటీవలే యూజీసీ నాక్ నుంచి ఏ డబుల్‌ప్లస్ గ్రేడ్‌ను సాధించి ప్రమాణాల విషయంలో అగ్రగామిలో ఉందని రుజువు చేసిందన్నారు. తరగతుల నిర్వహణతో పాటుగా, ప్రయోగశాలలో సాధన, ఎసైన్‌మెంట్లు తదితర రూపాల్లో బోధనా పద్ధతులు ఉంటాయన్నారు. కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో సుదీర్ఘ కాలంగా ఇగ్నో స్టడీ సెంటర్ కొనసాగుతుందని వివరించారు. స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎస్. సాంబశివరావు మాట్లాడుతూ తమ స్టడీ సెంటర్‌లో క్రమం తప్పకుండా తరగతులు కొనసాగటమే కాకుండా మంచి సదుపాయాలు ఉన్నాయని వివరించారు. సుదీర్ఘకాలంగా తమ స్టడీ సెంటర్ నుంచి ఎందరో ఉన్నత విద్యా కోర్సులను పూర్తి చేసి మంచి స్థాయిల్లో నిలిచారని వివరించారు. కార్యక్రమంలో స్టడీ సెంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, డి. పవన్‌కుమార్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్‌బాబు

19న జాతీయ కవి సమ్మేళనం

విజయవాడ కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 125వ జాతీయ స్థాయి కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు శ్రీశ్రీ కళావేదిక కృష్ణాజిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేఆర్ శేషకుమార్ తెలిపారు. మొగల్రాజపురంలోని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. శ్రీశ్రీ కళావేదిక ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల్లో 124కు పైగా కవి సమ్మేళనాలు నిర్వహించినట్లు తెలిపారు. 19వ తేదీ జరిగే కార్యక్రమంలో యువ కవులు ఎవరైనా స్వీయకవితా గానం చేయవచ్చని ఎటువంటి ప్రవేశ రుసుములేదని కవులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ బ్రోచర్‌ను అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా బాధ్యులు డాక్టర్ కొల్లేటి రమేష్, శ్రీశ్రీ కళావేదిక యువ ప్రతినిధులు డాక్టర్ కొల్లేటి రమేష్, నాగపావని,భానుతేజ, కృష్ణవేణి పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న విజయబాబు, శేషుకుమార్

రైతులకు ఇబ్బంది లేకుండా భూముల కొనుగోలు

పామర్రు: రైతుల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుని పేదల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసే జగనన్న కాలనీలకు అవసరమైన భూములు కొనుగోలు చేస్తామని ఉయ్యూరు ఆర్డీవో దాసి రాజు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన ఫిర్యాదు దారులైన రైతులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామంలో ఉన్న జగనన్న కాలనీ కోసం కొనుగోలు చేసిన భూముల పక్కనే ఉన్న రైతులు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైతులతో సమావేశమైనట్లు చెప్పారు. గతంలో ఏర్పాటు చేసిన కాలనీ పక్క భూములను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్షేత్ర స్థాయిలో పరిస్థితిని గమనించి మరోమారు రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని వివరించారు. భూముల విషయంలో రైతులు ఎవరికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. అన్ని శాఖల అధికారులు, రైతులతో కలిసి క్షేత్ర పరిశీలనకు సోమవారం హాజరు కావాలని ఆదేశించారు. తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా, రెవెన్యూ అధికారులు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామ సభ

పామర్రు: మండల పరిధిలో రూ.85 లక్షల నిధులతో 100 ఉపాధి పనులను నిర్వహించామని ఎన్ఆర్ఈజీఎస్ జిల్లా రిసోర్సు పర్సన్(డీఆర్‌పీ) లక్ష్మి తెలిపారు. స్థానిక పామర్రు సచివాలయం-1 వద్ద ఆదివారం గ్రామ స్థాయిలో ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ గ్రామ సభను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో సుమారు 40 వేల పని దినాలను చేశామన్నారు. ఈ తనిఖీలో కూలీల సంతకాలు చేయకుండా కూలీల వేతనాలు తీసుకున్నట్లు గుర్తించామన్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపు

గన్నవరం: గన్నవరం నియోజకవర్గంలో ఈ నెల 9వ తేదీన జరగనున్న జయభేరి బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు కె.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జయభేరి ర్యాలీ సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని విమర్శించారు. వీటిపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు సీపీఎం జయభేరి ర్యాలీ నిర్వహిస్తుందని తెలిపారు. పార్టీ నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, గుండిమేడ ఉదయభాస్కర్, సూరగాని సాంబశివరావు, మిరప నాగేశ్వరరావు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెనమలూరు: స్థానిక సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప శ్రీనివాసనగర్‌కు చెందిన బొల్లా అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో మచిలీపట్నం నుంచి తాడిగడపకు వస్తూ పెనమలూరు సెంటర్ వద్ద తన కారు ఆపాడు. వెనుక నుంచి వచ్చిన మరో కారు వీరి కారును ఢీ కొట్టడంతో అరుణ్ కుమార్ కారు ఎదురుగా ఆగిఉన్న ఆటోను ఢీ కొట్టింది. ఘటనలో అరుణ్‌కుమార్‌తో పాటు కారులో ఉన్న అతని తల్లి, పిన్నికి గాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోగల తాజ్ మసీద్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన గ్యార్మీ వేడుకలు ఘనంగా జరిగాయి. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ హబీబుల్లా, డివిజన్ పార్టీ నాయకులు ఎస్‌కే నజీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు పెద్ద పీట వేశారని అన్నారు. చంద్రబాబుకు తన సామాజికవర్గం తప్ప మరొకరు కనబడరని, అదే సీఎం జగనన్నకు కుల మత, రాజకీయ, వర్గాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను అక్కున చేర్చుకుంటున్నారని వివరించారు.

మంచి ప్రవర్తనతో మెలగాలి



పమిడిముక్కల: రౌడీ, సస్పెక్ట్ షీట్ హోల్డర్స్ సత్ప్రవర్తన అలవర్చుకోవాలని పమిడిముక్కల సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపారు. సీఐ కార్యాలయంలో ఆదివారం సర్కిల్ పరిధిలోని తోట్లవల్లూరు, పమిడిముక్కల స్టేషన్ల పరిధిలోని రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. తమ పనితీరు మార్చుకొని సమాజంలో మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే నేరాలకు దూరంగా ఉండాలని, అల్లర్లు సృష్టించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లపై నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందని, రౌడీయిజం, బెదిరింపులు, పంచాయితీల్లో తలదూరిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న సస్పెక్ట్ షీట్ హోల్డర్స్ అసాంఘిక కార్యకలాపాలకు, చట్టవ్యతిరేకమైన చర్యలకు, కోడిపందేలు, పేకాట, చిత్తులాట నిర్వహిస్తే నగర బహిష్కరణ చేయడానికి వెనుకాడబోమన్నారు. రౌడీ షీటర్లు తమ నేరస్వభావం మార్చుకోవాలని, మంచి నడవడిక కలిగిన వారిపై రౌడీషీట్లు తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే వంశీ ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ ఆకస్మికంగా మృతిచెందిన వారి కుటుంబాలకు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అండగా నిలబడటం అభినందనీయమని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. స్థానిక ఇందిరా నగర్‌కు చెందిన కాలి నిర్మల క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబానికి ఎమ్మెల్యే వంశీ రూ.25 వేలు ఆర్థికసాయంగా అందజేశారు.

వైఎస్సార్ సీపీ నాయకులు నిర్మల కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించారు. అదేవిధంగా కాకులపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సదర్ల కిషోర్ తల్లి ఫాతిమా గుండెపోటుతో ఇటీవల మృతి చెందటంతో ఆమె కుటుంబానికి కూడా ఎమ్మెల్యే వల్లభనేని వంశీ రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కిషోర్ కుటుంబాన్ని పరామర్శించిన వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే వంశీ ఆర్థికసాయంగా పంపించిన రూ.25వేలను కుటుంబసభ్యులకు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, బాపులపాడు, కాకులపాడు సర్పంచ్‌లు సరిపల్లి కమలాభాయి, కాజా ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు పడకల కోటేశ్వరరావు, నూకల జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ దయాల విజయనాయుడు, వార్డు సభ్యులు మేకల మరియమ్మ, ఇమ్మంది బాలరాజు పాల్గొన్నారు.



ఫాతిమా కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

గన్నవరం: అబ్బురపరిచే నృత్యాలు...ఆకట్టుకునే రంగోలి ముగ్గులు...అలరించే బృందగానంతో స్థానిక వీఎస్. సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్రస్థాయి సాహిత్య, సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం సాంస్కృతిక విభాగంలో ఎక్స్ టెంపర్, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. సాహిత్య విభాగంలో నిర్వహించిన జానపదం, వెస్ట్రన్ శైలిలో సోలో డ్యాన్సు, రంగోలి, గ్రూపు సింగింగ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సోలో డ్యాన్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తమ సంస్కృతులు, సంప్రదాయాలు ఉట్టి పడే విధంగా చేసిన ప్రదర్శనలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు పాడిన సందేశాత్మక బృందగానం ప్రేక్షకులను అలరించింది. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం బహుమతులను అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని

థైరాయిడ్ సమస్యలపై అవగాహన అవసరం

పెనమలూరు: థైరాయిడ్ సమస్యలపై అవగాహన ఉండాలని డాక్టర్ గంగూరి మురళీకృష్ణ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం థైరాయిడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధుల్లా థైరాయిడ్‌తో బాధపడే వారి సంఖ్య ఎక్కువగానే ఉందన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా చాలా మందికి థైరాయిడ్ వస్తోందని తెలిపారు. ఆహారంలో పోషకాల లోపం, హార్మోన్లు సరిగ్గా పని చేయక పోవటమే కారణమని చెప్పారు. థైరాయిడ్‌లో హైపోథైరాయిడ్, హైపర్ థైరాయిడ్‌లని రెండు రకాలు ఉన్నాయన్నారు. హైపో థైరాయిడ్ వచ్చిన వారికి ఆహారం అరగక పోవడం, బరువు పెరుగుతారన్నారు. హైపర్ థైరాయిడ్‌లో థైరాక్సిన్ ఎక్కువగా ఉత్పత్తి కావడంతో బరువు తగ్గుతారన్నారు. థైరాయిడ్ సమస్య ఎక్కువగా ఉంటే అల్లం వాడాలని సూచించారు. వ్యాయామం, సరైన ఆహారం, మంచి మందులు వాడితే సమస్య పరిష్కారమవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, వాకర్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డాక్టర్ మురళీకృష్ణ

బ్రాహ్మణ పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక

గన్నవరం: బ్రాహ్మణ పరిషత్ గన్నవరం మండల అధ్యక్షుడిగా పన్యారం విష్ణుమూర్తి ఎన్నికయ్యారు. మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలో ఉన్న శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం బ్రాహ్మణ పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, కార్యదర్శిగా గోపరాజు సత్యపవన్‌కుమార్, సహాయ కార్యదర్శిగా తిమ్మరాజు వెంకటసుబ్బారావు, కోశాధికారిగా మామిళ్ళపల్లి నాగసుబ్బారావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా యామర్తి వకుళ, సుదర్శనం శేషకుమార్, చదలవాడ శివనాగేశ్వరరావు, స్వర్ణ చంద్రశేఖర్, బొద్దనపల్లి నరేంద్ర, సరసత్వుల ఆదిత్య ఎంపికయ్యారు. బ్రాహ్మణుల సంక్షేమానికి అందరు కలిసికట్టుగా పనిచేయాలని విష్ణుమూర్తి తెలిపారు.



బ్రాహ్మణ పరిషత్ నూతన కార్యవర్గ సభ్యులు

మహాకరుణ శాకాహార ర్యాలీ

గన్నవరం: సరస్వతి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మహా కరుణ-శాకాహార ర్యాలీ నిర్వహించారు. స్థానిక రాయ్‌నగర్‌లో ప్రారంభమైన ఈ ర్యాలీని కేంద్రం నిర్వాహకురాలు నాగరమాదేవి ప్రారంభించారు. అనంతరం పెద్ద సంఖ్యలో పాల్గొన్న పిరమిడ్ సభ్యులు శాకాహారంతో కలిగే ప్రయోజనాలపై ప్రచారం నిర్వహించారు. ఆరోగ్యవంతమైన జీవనం కోసం శాకాహారం మాత్రమే తీసుకోవాలని నాగరమాదేవి తెలిపారు. ఆగిరిపల్లి సీనియర్ పిరమిడ్ మాస్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పిరమిడ్ సభ్యులు

నేత్ర వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక, అక్షయ నేత్ర వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని గాంధీ కో ఆపరేటివ్ బ్యాంక్ పైన ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ కోలా విజయ శేఖర్ నేతృత్వంలో సుమారు 200 మందికి పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా సుగర్ వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో క్లబ్ సీనియర్ సభ్యులు, వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్ (గొల్లపూడి) కార్యదర్శి దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలతోపాటు సుగర్ సంబంధిత బాధితులకు కంటి రెటీనాలో ఏర్పడే మార్పులను ఆధునిక వైద్య యంత్రాలతో పరీక్షలు చేశారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ టి.దుర్గామల్లేశ్వరరావు లయన్స్ క్లబ్ మెడిక సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అవసరమైనవారికి ఉచితంగా మందులు అందచేయటంతోపాటుగా దసరా మహోత్సవాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో సేవలందించిన వైద్య సిబ్బందికి సేవా పురస్కారాలను అందజేశారు. లయన్స్ క్లబ్స్ జోన్ చైర్‌పర్సన్ కె. గగారిన్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



నేత్ర వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ కోలా విజయ శేఖర్